ఓంశ్రీసాయిరాం

కర్ణుడు అర్జునుడు కంటె అన్నివిధాలా గొప్పవీరుడు కావాలని తగిన గురువుకోసం అన్వేషించసాగాడు. అతనికి తెలుసు పశురామునికి మించిన గురువులేరని. కానీ, పరశురాముడు క్షత్రియులకు పరమశత్రువు. బ్రాహ్మణులకు తప్ప యితరులకు మంత్రోచ్ఛారణచేస్తూ ప్రయోగించవలసిన అస్త్రశస్త్రముల రహస్యమును బోధించడు. కర్ణుడు ఏదోఒకవిధముగా ఆ విద్యను నేర్చుకోవాలని సంకల్పించాడు.

పరశురాముని దగ్గరకు వెళ్ళాడు బ్రాహ్మణవేషంతో. ఎంతో వినయవిధేయతలను, బుద్ధికుశలతను ప్రదర్శించి, ప్రకటించి అతనిని ఆకర్షించాడు. పరశురాముడు అతని ఆర్తిని, అర్హతను గుర్తించి అంగీకరించాడు. అతనికి ఎన్నో అస్త్రశస్త్రప్రయోగములను గురించి తెలిపాడు. నేర్పాడు. కొంతకాలం ఈవిధంగా గడిచింది. కర్ణుడంటే పరశురామునికి పూర్తి విశ్వాసము కలిగింది.

ఒక దినము కర్ణుని తొడమీద తన తలను పెట్టి పరశురాముడు నిద్రించాడు. మంచి నిద్రలో వున్నాడు. ఇంతలో ఒక కందిరీగ కర్ణుని తొడక్రింది భాగమునదూరి తొలుచుకుంటూ లోపలికి ప్రవేశించింది. కర్ణుడు కదిలితే గురువుగారికి నిద్రాభంగమవుతుందని అట్లే కదలకమెదలక నిగ్రహంతో బాధను సహించాడు. కొంతసేపటికి అతని తొడనుండి రక్తము బయటకు వచ్చి పరశురాముని తలక్రింద చేరింది. గురువుకు మెలకువ వచ్చింది. లేచి కూర్చున్నాడు. ఆశ్చర్యంతో కర్ణుని చూచాడు. 'నీవు ఎవరు? వెంటనే చెప్పు. నీవు బ్రాహ్మణుడవు కావు. ఇంతటి రక్తపాతమును ఒక్క క్షత్రియుడే సహించగలడు' అని గర్జించాడు. కర్ణుడు నిజము చెప్పక తప్పలేదు. 'స్వామీ! క్షమించండి. మీ వద్దనుండి విద్య నేర్చుకోవాలని ఆవిధంగా అసత్యము పలికాను' అన్నాడు. పరశురామునికి చాలా కోపం వచ్చింది. 'నీవు అసత్యము పలికి నేర్చుకున్న విద్య అవసరమైనప్పుడు ఉపయోగపడదు' అని శపించాడు.

కర్ణుని తత్త్వము మహా త్యాగస్వరూపము. దుస్సంగములో చేరటంచేత ఈ పేరు ప్రతిష్ఠలు కొంతవరకు నిర్మూలనమైనవిగానీ నిజముగా కర్ణుని త్యాగము ఎవరియందు కనిపించదు. మహాభారత యుద్ధములో 17వ దినము సమాప్తమైంది. ఆనాడు కర్ణుడు నేలకూలాడు. కర్ణుడు నేలకూలిన తక్షణమే పాండవులు అత్యంత ఆనందోత్సవములు జరుపుకుంటున్నారు. కౌరవులకు ప్రాణసమానుడు కర్ణుడు. కర్ణుడు నేలకూలినప్పుడు ఎవ్వరూ జయంచలేరని విఱ్ఱవీగుతూ కనిపించారు పాండవులు. ఒకవైపున కృష్ణుడు కూర్చొని విచారంగా కనిపించాడు. అర్జునుడు వెళ్ళి, 'ఇంత ఆనంద సమయంలో ఎందుకు మీరు విచారిస్తున్నారు?'అని అడిగాడు. 'భారతదేశ బలమే ఈనాడు క్షీణించిపోయింది. భారతదేశమునకు కీర్తిప్రతిష్ఠలు సాధించిన కర్ణుడు ఈనాడు కన్నుమూస్తున్నాడు. అలాంటి మహావీరుని కోల్పోతున్నామనే విచారము నన్ను చాలా బాధిస్తున్నాది' అన్నాడు కృష్ణుడు. ఈ మాటలు వినగానే కృష్ణుని చూస్తూ, 'కృష్ణా! పాండవుల విజయమునకై నీవు సారథిగా నిల్చావు. నీ సారథ్యములో పాండవులు విజయాన్ని సాధించారు. దీనికి సంతోషించక మన విరోధియైన కర్ణుడు కూలినాడని విచారము నీకెందుకు?' అన్నాడు. 'కర్ణుడు త్యాగస్వరూపుడు. త్యాగమనేది కర్ణుని రెండవ పేరు. కర్ణుని కంటె త్యాగి ఈ జగత్తులో ఒక్కడూ కనిపించడు. ఆనందమందు, కష్టమందు ఎలాంటి పరిస్థితియందైనా త్యాగమును వదలలేదు. అట్టి త్యాగము నీలో వుందా? లేదు. రా నావెంట' అని పిల్చుకొని వెళ్ళాడు. చిమ్మచీకటి కమ్ముకొన్నది. అర్జునుని తీసుకువెడుతున్నాడు కృష్ణుడు. 'కర్ణా! కర్ణా!' అని పిలుస్తూ వెడుతున్నాడు. కొన్ని నిముషాలలో కర్ణుని ప్రాణం పోతుంది. 'ఎవరు నన్ను పిలుస్తున్నారు? నేను ఇక్కడ వున్నాను' అని జవాబిచ్చాడు. ఆ శబ్దమును ఆధారము చేసుకొని కృష్ణుడు కర్ణుని దగ్గరకు వెళ్లాడు. వెళ్లే పూర్వము కృష్ణుడు బ్రాహ్మణ వేషము వేసుకున్నాడు. 'ఎవరు మీరు?' అని అడిగాడు కర్ణుడు. పంచప్రాణములింక పైకి పోతున్నాయి. అలాంటి పరిస్థితియందుకూడా ధైర్యముతో, ఉత్సాహముతో ఈ ప్రశ్నలు వేశాడు. కృష్ణుడు చెప్పాడు, 'నేను ఎంతో కాలమునుండి నీ పేరు వింటున్నాను. దానకర్ణుడనే గొప్ప కీర్తి మీరు సాధించారు. ఈనాటి నీ పరిస్థితి తెలియక దానమడిగే నిమిత్తమై వచ్చాను. నాకు దానం చేయాలి మీరు' అన్నాడు. 'తప్పక ఏమైనా సరే ఇస్తాను' అన్నాడు అప్పుడుకూడా.

'నా కుమారునికి వివాహము నిర్ణయము చేసుకున్నాను. నాకు కించిత్ బంగారము కావాలి' అన్నాడు. 'అయ్యో! కించిత్ బంగారమెందుకు? ఇంటికి వెళ్ళు. నా బార్య నీకు కావలసినంత బంగారము యిస్తుంది' అన్నాడు. ఈ బ్రాహ్మణుడు ఫక్కున నవ్వాడు. కించిత్ బంగారము కోసమై నేను హస్తినాపురం నీ ఇంటి దగ్గరకు వెళ్లి, ఇంత శ్రమపడవలెనా? నేను యివ్వటానికి వీలుకాదని ఒక్క మాట చెబితే నేను వెడతాను' అన్నాడు. 'నా ప్రాణము పోయేంతవరకు యిది కాదు అని చెప్పను' అన్నాడు. తన పండ్లకు బంగారు కవరు వేసుకున్నాడు. నోరు తెరచి, ఇదుగో ఈ బంగారు పండ్లు తీసుకొని వెళ్ళు' అన్నాడు కర్ణుడు. బ్రాహ్మణుడు కోపము నటిస్తూ, 'ఛీ! నీ పండ్లను నేను తీసుకొని పోవాలా? నీ పండ్లను ఊడగొట్టుటకు ఎంత హింస చేయాలి? ఈ దుర్మార్గమైన పని నేను చేయను. నేను బ్రాహ్మణుడను'. తక్షణము దగ్గరనున్న రాయి తీసుకొని పండ్లను ఊడగొట్టుకొన్నాడు. చేతులతో బ్రాహ్మణునకు యిచ్చాడు. బ్రాహ్మణ వేషములోనున్న కృష్ణుడు యింకనూ పరీక్ష మానలేదు. 'రక్తముతో కూడిన బంగారు నాకు దానము యివ్వడమా? ఛీ! నేను దానిని అంగీకరించను. వెడతాను' అన్నాడు. 'స్వామీ! కొంచెం ఆగండి' తాను కదలలేని పరిస్థితిలోపల తన అంబును తీసి ఆకాశమునకు వదిలాడు. మేఘములనుండి నీటిధారలు కారుతూ వచ్చాయి. దానితో ఈ పండ్లను కడిగి రెండు చేతులతో కృష్ణుని చేతిలో పెట్టాడు. అప్పుడు కృష్ణుడు తన స్వస్వరూపము చూపించి, 'కర్ణా! నేను కృష్ణుడను. నీ త్యాగమునకు నేను మెచ్చాను. ఎలాంటి పరిస్థితియందైనా త్యాగమునకు వెనుకంజ వేయలేదు. ఏమి కావాలో కోరుకో' అన్నాడు. అప్పుడు కృష్ణుని దర్శనము చేసుకొని రెండు చేతులూ జోడించుకొని, 'కృష్ణా! ఆపద్బాంధవా! లోకరక్షకా! ఈ జగత్తునే నీ హస్తమునందుంచుకున్న నిన్ను కోరేది ఏముంది? ఈ అంత్యసమయములో నీ స్వస్వరూపము దర్శించుకుంటూ, దర్శించుకుంటూ కన్ను మూయటం భాగ్యం. ఈ వరం నా కదించు' అన్నాడు. అంత్యములో దైవాన్ని దర్శించటమే జీవిత లక్ష్యం. 'ఎంత అనుగ్రహముతో దర్శనమిచ్చావు. ఇదియే నాకు చాలు. వందనములు' అన్నాడు. చూస్తూ వున్నాడు అర్జునుడు. 'అర్జునా! ఈ త్యాగమునకు నీవు సిద్ధముగా వున్నావా?' అప్పుడు అర్జునుడు తల వంచుకున్నాడు. మానవత్వములోనున్న త్యాగతత్త్వమును భగవంతుడు ఎన్నివిధములుగానో వర్ణిస్తూ వచ్చాడు. అందులో వీరికి వారికీ చేసే త్యాగము గొప్పది కాదు. దైవానికి చేసే త్యాగము గొప్పత్యాగము.

ఏ హృదయమునొసగితివో ఈశ నాకు
మగిడి దానినే యర్పింతు మహితమూర్తి
పరగ వేరేమిదెత్తు నీ అర్చనకును
అంజలి ఘటింతు అందుకోవయ్యా నీవు.